ప్రభుత్వభూముల్లో అక్రమ నిర్మాణాల గుర్తింపు

జిల్లా కలెక్టర్‌కు నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేస్తూ కబ్జాకు యత్నిస్తున్న వారి ఆగడాలను అరికట్టేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఎకరం రూ.30 కోట్లకుపైగా పలికే ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్న విషయమై శుక్రవారం 'సాక్షి'లో 'యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా !'అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 144లో 0.34 ఎకరాలు, 146లో 2.10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. పక్క భూమి యజమానులు వారి సర్వే నంబర్‌లు వేసి ప్రభుత్వ భూమిని అమ్ముతున్నారు. వారు ఇదివరకే తమ భూమిని విక్రయించారు. ఈ ప్రభుత్వం కొన్ని నోటరీల రూపంలోనూ చేతులు మారుతోంది. జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలతో వెంటనే గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐలు సురేష్, విక్రంరెడ్డిలు వచ్చి ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. రెండు సర్వే నెంబర్‌లలో 15 షాపులు, మరో 16 అక్రమ నిర్మాణాలు, ఒక మసీదు ఉన్నట్టు గుర్తించారు. అందులో ఒకరు జీవో 59 ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకోగా, మరొకరు కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్న విషయాన్ని తెలుసుకున్నారు. మరో నలుగురు జీవో 59 ప్రకారం దరఖాస్తులు చేసుకోగా అవి పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించారు. ఏడీ సర్వే నిర్వహించి రెండు సర్వే నెంబర్‌ల హద్దులను నిర్ణయించే పనిలో నిమగ్నమయ్యారు.



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

జిల్లా కలెక్టర్‌కు నివేదిక

సాక్షి దినపత్రికలో శుక్రవారం వచ్చిన కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గండిపేట తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి సర్వే నెంబర్ 144, 146లలో వచ్చిన నిర్మాణాల వివరాలను స్థానికంగా అడిగి తెలుసుకున్నారు. వాటిల్లో ఉన్న నిర్మాణాల వివరాలు, జరిగిన కబ్జాల వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపామని, తదుపరి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

పట్టుపట్టి.. పంతం నెగ్గి..

- మహేందర్‌గౌడ్‌ను గద్దె దించడంలో లతాప్రేమ్‌గౌడ్ సఫలం
- కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకున్న వైనం
- ఏకగ్రీవంగా మేయర్‌గా ఆమె ఎన్నిక



మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రంజిత్‌రెడ్డి, బొర్ర జ్ఞానేశ్వర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ తాజా మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, తాజా మేయర్ లతాప్రేమ్‌గౌడ్ చిరకాల రాజకీయ ప్రత్యర్థులు. మేయర్‌గా ఆయన ఒంటెద్దు పోకడలు పోతున్నారని అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్ ఆయనను గద్దె నుంచి దించేందుకు పక్కాగా పావులు కదిపారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితోపాటు 16 మంది కార్పొరేటర్లను కలుపుకొని మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస నోటీసు ఇచ్చారు. అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమైనప్పటి నుంచి ఆమెకు అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. అవిశ్వాసంపై హైకోర్టు నుంచి స్టే రావడంతోపాటు పలువురి నుంచి ఆమె బెదిరింపులు ఎదుర్కొన్నారు. ఎంత మంది అడ్డుపడినా ఆయనను మేయర్ పదవి నుంచి తొలగించాలని పట్టుపట్టి పంతం నెగ్గించుకున్నారు. ఎట్టకేలకు మహేందర్‌ను అవిశ్వాస తీర్మానంతో వైదొలిగేలా చేయడంలో ఆమె సఫలమయ్యారు. అనంతరం లతాప్రేమ్‌గౌడ్ కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకొని ఏకగ్రీవంగా మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు.

రాజకీయ నేపథ్యం..



కార్పొరేషన్ నూతన మేయర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మద్దెల లతాప్రేమ్‌గౌడ్

లతాప్రేమ్‌గౌడ్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. లతాప్రేమ్‌గౌడ్ మామ మద్దెల యాదయ్యగౌడ్ బండ్లగూడ జాగీరు సర్పంచ్‌గా పనిచేశారు. అప్పట్లో లతాప్రేమ్‌గౌడ్ టీడీపీ ఎంపీటీసీగా పనిచేశారు. అయితే అప్పట్లో ఆమెకు వైస్ ఎంపీపీ పదవి తృటిలో తప్పిపోయింది. వైస్ ఎంపీపీని ఎన్నుకునే సమయంలో అప్పటి ఎంపీటీసీ మహేందర్‌గౌడ్ తన ఓటును లతాప్రేమ్‌గౌడ్‌కు వేయకుండా కావాలని సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో అప్పుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీ వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు.

శుభాకాంక్షలు తెలిపిన రంజిత్‌రెడ్డి

బండ్లగూడ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన లతాప్రేమ్‌గౌడ్‌కు చేవెళ్ల లోక్‌సభకు కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన డాక్టర్ రంజిత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ కలిసి సన్మానించారు.

మురుగు తొలగింది



మురుగునీటిని తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ సాయినగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. వారంరోజులుగా మురుగు నీరు రోడ్లపై పొంగిపొర్లుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించింది. దీనిపై స్థానిక నాయకుడు బోయ రమేశ్ తదితరులు జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ కమిషనర్ స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది 24 గంటల్లో మురుగునీటిని తొలగించారు.

ఫ్లైఓవర్ కింద పారిశుధ్య చర్యలు



ఫ్లైఓవర్ కింద పారిశుధ్య పనులు చేపడుతున్న మున్సిపాలిటీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శంషాబాద్: పట్టణంలోని ఫ్లైఓవర్ కింద మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. సాక్షి దినపత్రిలో 'అల్లరి మూకల అడ్డాగా శంషాబాద్ ఫ్లైఓవర్ 'శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఫ్లైఓవర్ పిల్లర్ల వద్ద బహిరంగ మూత్ర విసర్జనతో పారిశుధ్య అస్తవ్యస్తంగా మారిందన్న విషయాన్ని తెలియజేయడంతో స్పందించిన మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పర్యవేక్షణతో పారిశుధ్య సిబ్బంది పరిశుభ్రత పనులు చేపట్టారు. అన్ని పిల్లర్ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రంగా మార్చారు.

ట్యాంకర్ డ్రైవర్ల దాడి

మణికొండ: నీటి ట్యాంకర్లను నెమ్మదిగా నడపాలని చెప్పినందుకు ఓ వ్యక్తిపై ట్యాంకర్ల డ్రైవర్లు దాడి చేసిన సంఘటన మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద గురువారంరాత్రి జరిగింది. గురువారం రాత్రి ట్యాంకర్‌ను వేగంగా నడుపుతుండటంతో డ్రైవర్‌ను నెమ్మదిగా నడపాలని మణికొండ క్వార్టర్స్‌లో ఉంటున్న కె.శంకర్ సూచించాడు. దాంతో కోపగించిన డ్రైవర్ మరో డ్రైవర్‌ను పిలిపించుకుని అతనిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వేగంగా వాహనాలు నడపడం వల్ల కాలనీలలోని రోడ్లపై పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, ట్యాంకర్ల డ్రైవర్‌లను నెమ్మదిగా నడిపేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గతంలోనూ పలుమార్లు ట్యాంకర్ల డ్రైవర్‌లు ప్రమాదాలు చేయడంతో పలువురు గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. ఇలాంటి దురుసు ప్రవర్తన ఉన్న డ్రైవర్‌లు, ట్యాంకర్లను జలమండలి అధికారులు తొలగించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకు పీఅండ్‌టీ కాలనీ ఏ, బీ, సీ, డీ–బ్లాక్, స్పెషల్ బ్లాక్, కీర్తి రిచ్‌మండ్ విల్లా, విద్యానగనర్, వీకర్‌సెక్షన్ కాలనీ, సన్ సిటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హిమగిరినగర్, సన్‌సిటీ మెయిన్ రోడ్డు, వెస్టెండ్ కాలనీ, గంధంగూడ ప్రాంతాల్లో మరమ్మత్తుల నేపథ్యంలో కోత విధిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మణికొండ: ఇబ్రహీంబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల మరమ్మత్తులు, విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నెక్నాంపూర్ గ్రామం, ఫెయిర్‌ఫీల్డ్, ఈవీవీ, వన్‌మోన్‌నగర్ కాలనీలతోపాటు ఫ్లోటిల్లా అపార్ట్‌మెంట్స్, రాందేవ్‌గూడ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. సాయంత్రం 3 నుంచి ఐదు గంటల వరకు వెసెల్లా మెడోస్, తారామతి, బారాదరి, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 29, 30లు, ఖాస్పా కాలనీ, మార్వా టౌన్‌షిప్, కోహినూర్ ఎన్‌క్లేవ్, పాష కాలనీ, అలిజాపూర్, ఎస్‌ఆర్‌ఐ ఎన్‌క్లేవ్, ఖిజ్రా కాలనీ, కేజీఎస్ జీరాక్స్, వెంకటేశ్వర కాలనీ, పయినీర్ ఎస్టేట్, ఈవీవీ కాలనీ, కృష్ణారెడ్డి లేఅవుట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

- హుడా కాలనీ ఫీడర్ పరిధిలోని హుడా కాలనీ, శివాజీనగర్, సిక్ చావునీ, 9 నంబర్ రోడ్డు, పాండురంగానగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు.
- పాండురంగానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పాండురంగానగర్, శివాజీనగర్, సీసీఎండీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్‌ల పరిధిలో మెయింటెనెన్స్, విద్యుత్ వైర్లకు సమీపంలో చెట్లకొమ్మలను తొలగించటం పనులు చేస్తున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు.

- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గోల్డన్ టెంపుల్, షిరిడిసాయి నగర్ కాలనీల పరిధిలో,
- మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ఫ్రెండ్స్ కాలనీ, పోకల్‌వాడ, తనీషానగర్, హుడా కాలనీలు,
- మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లాలమ్మగార్డన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

నడక కోసం బయటకు వెళ్లి..

శంషాబాద్: నడక కోసం బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది. పట్టణంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో నివాసముండే అనిల్‌కమార్(35) పక్షవాతంతో బాధపడుతున్నాడు. ప్రతిరోజు సాయంత్రం మినీస్టేడియం వద్ద వాకింగ్ వెళుతుంటాడు. ఈ నెల 23 సాయంత్రం వాకింగ్ కోసం బయటికి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

మణికొండ: నార్సింగిలోని వెస్టన్ సంస్థ లేబర్ క్యాంపులో ఉండి కూలీ పనిచేస్తున్న మహిళ కనిపించకుండాపోవటంతో ఆమె అన్న రాజు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్సై బుచ్చయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన అరుణ కోల్(31) తమ కుటుంబంతో కలిసి వచ్చి నార్సింగిలో ఉంటూ పనిచేసుకుంటున్నారు. అక్కడే క్యాంపులో ఉంటున్న ఆమె ఈ నెల 18వ తేదీ నుంచి కనిపించకుండాపోవటంతో శుక్రవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మహిళ వివరాలు తెలిస్తే నార్సింగి పోలీస్‌స్టేసన్‌లో సమాచారం ఇవ్వాలని ఏఎస్సై కోరారు.



లేబర్ క్యాంప్‌నుంచి వెళ్లిన అరుణ కోల్

అందుబాటులో 'వానాకాలం' విత్తనాలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ గోపీ



విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ఈ వానాకాలం సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల్ని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంచుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ గోపీ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విత్తనమేళ –2024 ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇప్పటికే రాష్ట్రంలో పచ్చరొట్ట విత్తనాలు పంపిణీ ముమ్మరంగా సాగుతుందని రైతుల డిమాండ్‌కి అనుగుణంగా అన్ని జిల్లాల్లో ఆయా రకాల విత్తనాలను అందుబాటులో ఉంచడానికి రెండు నెలల నుంచి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రభుత్వం చాలా తీవ్రమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కొత్త టెక్నాలజీలు, సాగు విధానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు రైతు నేస్తం అనేక కార్యక్రమాలతో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు శాస్త్రవేత్తల మధ్య చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ కమిషనర్ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల్లో విత్తనాలను అందుబాటులో ఉంచామని రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జగన్మోహన్ రావు విత్తన ధ్రువీకరణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేశవులు విశ్వవిద్యాలయం అధికారులు,శాస్త్రవేత్తలు,రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: ముందు వెళుతున్న లారీని ఓవర్‌టెక్ చేసేందుకు ప్రయత్నించిన డీసీఎం డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ ఓఆర్‌ఆర్‌పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుర్కయంజాల్ ప్రాంతానికి చెందిన శశిధర్‌రెడ్డి(34) డీసీఎం డ్రైవర్. శుక్రవారం ఉదయం శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు డీసీఎంలో వెళుతున్నాడు. ఓఆర్‌ఆర్ హిమాయత్‌సాగర్ వద్దకు రాగానే లారీని ఓవర్ టేక్ చేసేందుకు వెళుతూ వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో డీసీఎం ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. శశిధర్ క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు అతి కష్టం మీద శశిధర్‌ను బయటికి తీసి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోకాపేటలో క్లౌడ్ కిచెన్ ప్రారంభం



కోకాపేటలో క్లౌడ్ కిచెన్‌ను ప్రారంభించిన కౌన్సిలర్లు

మణికొండ: పొదుపు సంఘాల మహిళలు శిక్షణ పొంది ఏర్పాటు చేసుకున్న క్లౌడ్ కిచెన్‌ను శుక్రవారం కోకాపేటలో కౌన్సిలర్లు ప్రారంభించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఇటీవల పొదుపు మహిళా సంఘాలకు సయోధ్య సంస్థ ద్వారా నెల రోజులపాటు కుకింగ్‌లో శిక్షణ ఇచ్చారు. వారికి అవసరమైన వంట సామగ్రిని సమకూర్చటంతో శుక్రవారం నుంచి వారి పనులు ప్రారంభించారు. క్లౌడ్ కుకింగ్‌ను ప్రారంభించిన కౌన్సిలర్లు విజయ్‌బాబు, శివారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగితే వారి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఒక్కరి సంపాదనతో కుటుంబాలు గడవటం కష్టంగా ఉందని, ఇద్దరు పనిచేసి డబ్బు ఆర్జిస్తేనే రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ క్రమంలో గండిపేట మహిళలకు శిక్షణ ఇచ్చి కిచెన్‌ను ఏర్పాటు చేయాలని నాయకుడు గోపాల గణేష్ కోరటంతో వారు అంగీకరించారు. క్లౌడ్ కిచెన్‌లో తయారైన వంటలను అమ్ముకునేందుకు మంచి స్థలంలో అవుట్‌లెట్ ఏర్పాటు చేస్తామని కౌన్సిలర్‌లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సయోధ్య డైరెక్టర్ మృదుల, ఆపరేషన్ టీం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరదల ముప్పు.. రక్షణకు రెడీ

అత్తాపూర్: మరోపక్షం రోజుల్లో వేసవి ముగియనుండటంతో ప్రజారోగ్య రక్షణ చర్యలకు ప్రభుత్వం సర్వం సిద్ధమవుతున్నది. వర్షాకాలంలో వరద ముప్పు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య, ఆరోగ్యశాఖ, నగర పాలక యంత్రాంగం కసరత్తు మొదలుపెట్టింది. వర్షాకాలంలో ప్రబలే రోగాల నివారణ, నియంత్రణ చర్యలపై వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది. వర్షపునీరు మురుగు కాల్వల ద్వారా సాఫీగా వెళ్లిపోయే ఏర్పాట్లపై జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు సంయుక్తంగా కసరత్తు చేస్తున్నాయి. నీటి పారుదల శాఖ సహకారం తీసుకోనున్నది. కేవలం పది, పదిహేను నిమిషాల వర్షానికి నగర రోడ్లు చెరువులు, కుంటలను తలపించే దుస్థితిని నగరం పలుమార్లు చవి చూసింది. మురుగుకాల్వలు పూడికతో నిండిపోయి రోడ్లపై వర్షపునీరు పారడం, పలుచోట్ల ఇళ్లల్లోకి నీరు చేరిపోవడం లాంటి సమస్యలు గత వర్షాకాలంలో తలెత్తాయి. మురుగునీరు ఇళ్లల్లోకి చేరిపోయి ఈగలు, దోమలు పెరిగిపోయి పలు రోగాలు వ్యాప్తి చెంది ప్రజారోగ్యానికి ముప్పు తెచ్చే పరిస్థితులను కూడా నగర ప్రజలు అనేక మార్లు చవిచూశారు. గత వర్షాకాలంలో ఎదురైన పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు రెవెన్యూ, వైద్య ఆరోగ్య, నగర పాలక సంస్థ, మంచి, మురుగునీటి సరఫరా విభాగాల అధికారులు చెబుతున్నారు.



మున్సిపల్ కమిషనర్ కార్యాలయం

వానాకాల ముప్పను ఎదుర్కొంటాం



వర్షాకాలంలో నగర ప్రజాజీవితానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే అన్ని సమస్యలను ఎదుర్కొనే విధంగా ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. ఐదు డివిజన్లలో ఐదుగురు సభ్యులతో కూడిన బృందాలను ఇప్పటికే ఏర్పాటు చేశామని చెప్పారు. మ్యాన్‌హోళ్ల పరిస్థితులను పూర్తిగా అధ్యయనం చేశామన్నారు. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. చెత్తాచెదారం వేసిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవడానికి కూడా రంగం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రచారంలో ఎన్‌జీవోలకు భాగస్వాములను చేయనున్నట్లు చెప్పారు. ఈ పనుల్లో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చెరువులు, కుంటల్లో వరదనీటి నిర్వహణ కోసం నీటిపారుదల శాఖ యంత్రాంగం సహకారాన్ని తీసుకోనున్నట్లు చెప్పారు.

–రవికుమార్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్

అదనపు నిర్మాణాలను కూల్చివేస్తాం

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని, అందుకు విరుద్ధంగా అదనపు అంతస్తులు వేస్తే వాటిని కూల్చివేస్తామని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం పంచవటి కాలనీ రోడ్డు నెంబర్ 16, 17లలో చేపట్టిన రెండు అదనపు నిర్మాణాలను టీపీవో సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. రెండు నిర్మాణాలు మున్సిపాలిటీ నుంచి జీప్లస్ ఐదు అంతస్తులకు అనుమతులను పొంది ఆరవ అంతస్తు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. అలాంటి అదనపు అంతస్తుల రిజిస్ట్రేషన్‌లు జరగటం లేదని, వాటిని కొనుగోలుదారులు తీసుకోవద్దన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇలాంటి నిర్మాణాలన్నింటికీ ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, వాటన్నింటినీ రోజువారీగా కూల్చివేస్తామన్నారు. తిరిగి వారు నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



పంచవటి కాలనీలో అదనపు అంతస్తును కూల్చివేస్తున్న సంతోష్‌సింగ్

ఔటర్‌పై 'ఐషర్' బోల్తా.. భారీగా ట్రాఫిక్ జాం

శంషాబాద్: ఔటర్ రహదారిపై వాహనం బోల్తా పడటంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామైంది. పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీ సమీపంలో శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు లైట్ల లోడుతో వెళుతున్న ఐషర్ వాహనం శుక్రవారంరాత్రి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వెనక నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, ఔటర్ సిబ్బంది సుమారు గంటపాటు శ్రమించి వాహనాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు. సుమారు గంటపాటు స్తంభించిన ట్రాఫిక్‌తో ఔటర్ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆకట్టుకున్న విత్తనమేళా





ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విత్తనమేళా రైతులను ఆకట్టుకుంది. రైతులు పెద్ద సంఖ్యలో వచ్చి విత్తనాలను కొనుగోలు చేశారు. గతంలో కంటే ఈసారి రైతులు అధిక మొత్తంలో వచ్చారు. ఈ ఒక్కరోజే కాకుండా శనివారం నుంచి కూడా విత్తనమేళా ఉంటుందని అధికారులు తెలిపారు.





